# కెజిపి వారి...

-:కోనసీమలోని అయినపిల్లి లంక గ్రామం, రచ్చబండ. కళ్యాణరావు, గోపాలరావు, పోతురాజు, రామం 'మీటింగ్'లో ఉన్నారు.:-

"ధాన్యం కొట్లు, సూరిబాబుకి కౌలుకిచ్చిన నాలుగెకరాలు, టౌన్‌లో నాలుగు షాపులు," చెప్పాడు కళ్యాణరావు, కళ్ళజోడుని సరిచేసుకుంటూ ఆకాశంలోకి చూస్తూ.

"మరి మీ సంగతి?" అడిగాడు పోతురాజు గోపాలరావువైపు చూస్తూ.

"ఏముంది, మా బామ్మర్ది మెడికల్ షాపు, మా ఆవిడ పాల వ్యాపారం, మన చిన్న బస్సు 'పంచకళ్యాణి'."

"మీరు సొంతంగా పడ్డ కష్టమేం లేదన్నమాట అయితేనీ.. ఈ ఏడాది పాటూనూ..," తేల్చేసాడు పోతురాజు ఇద్దరివైపు చూస్తూ.

"మరదేటయ్యా.. ఏడాది పాటు ఖాళీగా కూసుని ఓ సినిమా కథ రాయలేకపోయారా? స్టోరీ రాసేస్తే సినిమా తీసేస్తానని రంగూన్ రాజిబాబు మాటిచ్చాడా? ఇంకో రెండు నెలల్లో మళ్ళీ ఆడొచ్చేస్తాడు," తగులుకున్నాడు రామం.

"నేను ముందే చెప్పానండీ బాబూ.. సినిమా కథ రాయడమంటే అదేం నాలుగైదు ఎర్రి పాటలు రాసేసి పంచకళ్యాణిలో పెట్టించేయడం కాదని..," అందుకున్నాడు పోతురాజు.

"అబ్బా పోతురాజూ, చావగొట్టేస్తున్నావ్ కదరా. అన్నట్టొరే, ఆ ఈరిగాడికి నాలుగు తగిలించాల్రా. ఊరు దాటగానే ఆడు నా పాటలు తీసేసి సినిమా పాటలు పెడతన్నాట్ట," అన్నాడు గోపాలరావు టాపిక్ మారుస్తూ.

"పోన్లెండీ. ఆడి సంగతి తర్వాత చూసుకోవచ్చు గానీ ముందు ఈ కథ సంగతి చూడండి. కళ్యాణరావుగారూ.. మీకు గోపాలకృష్ణ చాలా ఐడియాలిచ్చాడంట కదా?" అడిగాడు పోతురాజు.

"ఆడి తలకాయ్. ఆడివే ఐడియాలైతే మరి సూపర్ మ్యాను సినిమాలు తీసినాళ్ళవేటి?" అన్నాడు గోపాలరావు.

కళ్యాణరావు ఇంకా ఆకాశంలోకి చూస్తూనే ఉన్నాడు.

"అదేటయ్యా.. బొత్తిగా ఏం లేకపోవడం కన్నా ఏదో ఒక ఐడియా మంచిదే కదా. ఇంతకీ ఆడేం చెప్పాడేటి?" అడిగాడు రామం.

"అదిగో వస్తున్నాడు కదా. ఆడినే అడుగుదాం," జుట్టు రేగిపోయి, బొత్తాలు ఎగుడు దిగుడుగా పెట్టుకుని, రొప్పుతూ వస్తున్న గోపాలకృష్ణని చూసి అన్నాడు గోపాలరావు.

"ఏమయ్యా గోపాలకృష్ణా, ఏటి.. పొద్దున్నే మీ ఆవిడ చీపురుకి పని చెప్పేసావేటి?" వెటకారంగా అడిగాడు పోతురాజు.

"ఏరా, మొన్న పంచాయితీలో ఒప్పుకున్నావా లేదా నువ్వు? పొద్దున్నే లేచేసి, ఇల్లు తుడిచేసి, కళ్ళాపి చల్లి ముగ్గులేసేసి, అంట్లు తోమేస్తానని చెప్పావా లేదా?" అడిగాడు గోపాలరావు.

జుట్టు సరిచేసుకుంటూ అందరివైపు ఒకసారి చూసి, "ముగ్గులేయడం నా వల్ల కాదని ఆ రోజే చెప్పానండి," అన్నాడు గోపాలకృష్ణ.

"పోనీ, ఇల్లైనా తుడిచేసి అంట్లు తోమావా?" అడిగాడు రామం.

"ఎక్కడండి.. రాత్రి స్టూడియో పనిలో బాగా లేటయిపోయింది పడుకునేసరికి. పొద్దున్నేమో లేవలేదు. దాంతో మా ఆవిడే అంట్లు తోముకుని, ఇదిగో.. నన్ను కూడా తోమేసింది," దీనంగా చెప్పాడు గోపాలకృష్ణ గుండీలు సరిచేసుకుంటూ.

"ఎందుకొచ్చిన స్టూడియోరా అది? ఇప్పటిదాకా పాస్‌పోర్ట్ ఫోటోలు తప్ప ఒక్క పెళ్ళి కాంట్రాక్టైనా చేసావా?" అడిగాడు గోపాలరావు.

"మీదేం పోయిందండి.. ఎన్నైనా చెప్తారు. ఇప్పుడు ఆ స్టూడియో మూసేస్తే ఇంట్లో కూర్చోవాలి. ఇక చాకలోడు కూడా నన్ను తిట్టుకోడం మొదలెడతాడు. ఇప్పడికే ఈరమ్మ నాకు పడి ఏడుస్తోంది.. దాని పని పోగొట్టానని," నిజం చెప్పాడు గోపాలకృష్ణ.

"సరే, నీ గోల ఎప్పుడూ ఉండేదే గానీ.. ఇంతకీ కళ్యాణరావుకి కాసిని ఐడియాలేవో ఇచ్చావంట కదా. ఏది, ఒకటో రెండో ఇలా వదులు," అడిగాడు రామం.

"కాసినేటండి బాబూ, చాలా ఇచ్చాను.. ఈయనకేం నచ్చలేదుగానీ. అయినా, టీ పడితే కానీ నా బుర్ర పని చెయ్యదండి," చెప్పాడు గోపాలకృష్ణ పొట్ట నిమురుకుంటూ.

వెంటనే పోతురాజు అందుకున్నాడు. "ఏటి, నీ ఐడియాలకి బుర్ర కూడా కావాలేటి? సర్లే, ఒరే చిన్నిగా.. గోపాలకృష్ణగారికని చెప్పి ఓ స్పెషల్ టీ పట్రా," ఖాళీ గ్లాసులు పట్టుకెళ్ళడానికి వచ్చిన చిన్నిగాడితో చెప్పాడు పోతురాజు.

మధ్యలో గోపాలకృష్ణ ఆపుతూ "అరరే, స్పెషల్ టీ వద్దురా.. నీకు దణ్ణం పెడతాను. డబ్బులిస్తాను గానీ మామూలు రెగ్యులర్ టీ పంపించమని చెప్పరా," అని చిన్నిగాడిని రిక్వెస్ట్ చేసాడు.

"రెగ్యులర్ టీ అయితే రూపాయిన్నర అవుద్దండి. డబ్బులీయ్యకపోతే మీకు టీ ఇయ్యొద్దని చెప్పాడండి మా మాస్టరు. లేకపోతే స్పెషల్ టీ మాత్రం పట్టుకొస్తానండి కావాలంటేనూ," చెప్పాడు చిన్నిగాడు.

"డబ్బులిస్తాలేరా.. ఇప్పుడు దగ్గర డబ్బుల్లేవు. చూసావు కదా. చొక్కా జేబు చూడు.. జేబు కూడా చిరిగిపోయింది. మళ్ళీ కనిపించినప్పుడిస్తాలే," గదమాయిస్తున్నాడో, బ్రతిమాలుతున్నాడో తెలియకుండా చెప్పాడు గోపాలకృష్ణ.

"సరేండయితే. నా అకౌంట్‌లో రాసి తీసుకొస్తాను.. పన్నెండ్రూపాయిలవుద్ది దీంతో కలిపి," చెప్పి టీ తీసుకురావడానికి వెళ్ళాడు చిన్నిగాడు.

గోపాలకృష్ణ చప్పుడు చేసుకుంటూ టీ తాగడం పూర్తి చేసి కప్పు పక్కన పెట్టాడు. కప్పులో ఓ చుక్క మిగిలిపోవడం చూసి మళ్ళీ కప్పు తీసుకుని ఆ చుక్క కూడా చప్పుడు చేసుకుంటూ తాగి కప్పు పక్కన పెట్టి అందరివైపు చూసాడు. అందరూ గోపాలకృష్ణవైపే చూస్తున్నారు. గోపాలకృష్ణ ఐడియాలు ముందే తెలిసిన కళ్యాణరావు తన పోజు మార్చకుండా అలానే చేతులు వెనక్కి పెట్టి ఆకాశంవైపు చూస్తూ కూర్చున్నాడు.

గోపాలకృష్ణ మొదలుపెట్టాడు.

"మనలో చాలా ఐడియాలున్నాయి గానీ మచ్చుకి ఒకటి చెప్తాను, ఇనుకోండి. అసలు డిస్ట్రబెన్స్ ఉండకూడదు మరి, ఏంటి? ఇది సినిమా

టైటిల్స్, హీరో ఇంట్రడక్షను.. అప్పటి సీనన్నమాట. ముందు.. 'కెజిపి వారి...' అని పడుద్ది.."

"కెజిపి అంటే ఏంటండీ?" మొదట్లోనే ఆపుతూ అడిగాడు చిన్నిగాడు.

"కాకిగోల ప్రొడక్షన్స్ లేరా," చెప్పాడు పోతురాజు వెటకారంగా నవ్వుతూ. అంతా ఘొల్లున నవ్వారు.

"ఏంటెహె మీ కాకిగోల? డిస్ట్రబెన్స్ చెయ్యొద్దని చెప్పానా? కెజిపి అంటే కళ్యాణరావు-గోపాలరావు ప్రొడక్షన్సు. బొత్తిగా జ్ఞానం లేదురా మీకు.. సరే, గమ్మునుండండి.. హీరో ఇంట్రడక్షను సీను. వర్షం పడతాంది. బుల్లెట్టు మీద ఒకడు స్పీడుగా ఎళ్తా ఉంటాడు. మన కెమెరా ఎనక చక్రం మీద ఫోకస్ చేసి ఉంటది. రోడ్డంతా బురద.. వర్షం పడతాంది కదా. ఈ బురదంతా ఎనక్కి కొట్టేసి కెమెరా మీద పడతా ఉంటది. నిమ్మదిగా కెమెరా మొత్తం బురదతో నిండిపోద్ది. అంటే తెర మీద మనకేం కనపడదన్నమాట. అప్పుడు బండి స్కిడ్డయినట్టు సౌండినపడుద్ది. ఆ బండి మీదున్నోడు కింద పడతాడన్నమాట. అప్పుడు ఆడు కిందపడినదానికి రోడ్డు మీదున్న నీళ్ళు కెమెరా మీద పడి బురద కొంచెం పోద్దన్నమాట. అప్పుడు ఆ ఖాళీలోంచి మొహం మీద నీటిని తుడుచుకుంటూ మన హీరో కనిపిస్తాడు. కింద హీరో పేరు పడుద్ది.."

"అంటే, ఆ కింద పడ్డదే హీరోనాండీ?" అమాయకంగా అడిగాడు చిన్నిగాడు.

"కాదెహె, ఇంకోడెవడో. నీకు బుర్ర పని చెయ్యదేట్రా చిన్నిగా?" 'అంత క్లియర్‌గా చెప్తే అర్థం కాలేదా' అనే ఎక్స్‌ప్రెషన్ పెట్టి కోపంగా అడిగాడు గోపాలకృష్ణ.

"లేదులేరా, ఆడు హీరో అయితేనే బాగుంటది. ఇంతకీ హీరో పేరేటి? బంకబాబా?" గట్టిగా నవ్వుతూ అడిగాడు గోపాలరావు.

మళ్ళీ అందరూ ఘొల్లున నవ్వారు. మొహం మాడ్చుకున్నాడు గోపాలకృష్ణ.

"మీరెన్నైనా అనండయ్యా.. మనోడి త్రివేణి కలర్ ఫోటో స్టూడియో రేంజ్‌కి ఈ ఐడియా చాలా బాగుంది. ఇదిగో గోపాలకృష్ణా, నువ్వేం చేస్తావంటే.. ఇలాంటి ఐడియాల్ని బాగా ఇంప్రూవ్‌మెంట్ చేస్తా ఉండు. నువ్వు సినిమాల్లోకి వెళ్ళినప్పుడు బాగా పనికొస్తాయి.. ఏంటి?" అన్నాడు రామం గోపాలకృష్ణ భుజం మీద చెయ్యి వేస్తూ.

గోపాలకృష్ణ కృతజ్ఞతాపూర్వకంగా రామంవైపు చూసాడు.

"సరేనయ్యా, నేను మా అమ్మాయి వాళ్ళ ఊరెళ్తన్నా. నేనొచ్చేసరికి మొత్తం కథ రెడీ చేసెయ్యండి, ఏంటి..?" అని అక్కడినుంచి బయలుదేరాడు రామం.

-:ఆ రోజు సాయంత్రం...:-

చీకటి పడుతూ ఉంది. గోపాలరావు కళ్యాణరావు ఇంటికి వచ్చాడు. కళ్యాణరావు పెరట్లో పడక్కుర్చీలో కూర్చుని ఆకాశంవైపు చూస్తున్నాడు.

"పొద్దున్నుంచీ చూస్తన్నాను. ఎప్పుడు చూసినా ఆకాశంవైపు చూస్తూ కూర్చుంటావు. ఏంటి.. ఆకాశానికి, నీకు కొత్తగా ఈ కనెక్షనేంటి?" అడిగాడు గోపాలరావు.

"అబ్బే, ఏం లేదు రావూ.. రా, కూర్చో. ఏం లేదు.. నిన్న ఓ చిత్ర విచిత్రమైన సంఘటన జరిగింది. మా శీనుగాడి స్కూలు బయట ఒక కుంటోడు ఉంటాడు కదా.."

"ఎవరూ? కుంటి పిచ్చోడా?"

"ఆఁ, ఆడే. నిన్న నేనక్కడుండగా ఆడెవడో సైకిలు మీద ఎళ్తా ఆడిని గుద్దేసాడు. ఆడేమో కిందపడిపోయాడు. నేనేమో ఆడిని లేపడానికి ఎళ్ళి ఆడి చెయ్యి పట్టుకున్నాను. అప్పుడు ఆడు నన్నో చిత్రమైన కొశ్చిన్ అడిగాడు."

"ఏంటి? కుంటి పిచ్చోడు మాట్లాడాడా?"

"ఆఁ, అదే కదా.. 'నేను పడిపోయానని హెల్ప్ చేస్తనావా, లేవడానికి ట్రై చేస్తన్నానని హెల్ప్ చేస్తనావా?' అని అడిగాడు ఆడు నన్ను. 'పడిపోయావనే హెల్ప్ చేస్తనాను' అన్నాను నేను."

"ఎలాగెలాగా.. పడిపోయానని హెల్ప్ చేస్తనావా, లేవడానికి ట్రై చేస్తన్నానని హెల్ప్ చేస్తనావా అని అడిగాడా? హార్నీ. పిచ్చోడి మాటలూ.. అయినా ఆడి మాటలు అర్థం అయితే వింత గానీ అర్థం కాకపోతే వింతేముంది రావూ?"

"కరెక్టే రావూ.. మామూలుగా అయితే నేనూ పట్టిచ్చుకునేవాడిని కాదు. కానీ ఆడు 'నువ్వు పడిపోయావనే హెల్ప్ చేస్తనాను' అని నేననేసరికి నా చెయ్యి విదిలించుకుని డేక్కుంటూ ఎళ్ళిపోయాడుగానీ నా హెల్ప్ మాత్రం తీసుకోలేదు. దాంతో మతిపోయింది నాకు. అప్పటినుంచి ఆలోచిస్తానే ఉన్నా ఆడి భావం ఏంటా అని."

"మరేమైనా అర్థమయిందా?"

"ఏమో మరి.. బాగా ఆలోచించగా ఆలోచించగా నాకేమనిపించిందంటే.. మనం కష్టంలో ఉన్నోడికి కాకుండా ఆ కష్టంలో నుంచి బయటపడ్డానికి ట్రై చేస్తున్నోడికి మాత్రమే హెల్ప్ చెయ్యాలి. అంటే కష్టంలో ఉండటం క్వాలిఫికేషను కాదు, ఆ కష్టంలో నుంచి బయటపడ్డానికి ట్రై చెయ్యడం క్వాలిఫికేషను అన్నమాట."

"ఓరోరి.. తస్సదియ్యా కళ్యాణరావా.. ఎంత గొప్పగా చెప్పావురా! కుంటి పిచ్చోడు నిన్ను ఒక్క మాటతో వేదాంతిని చేసేసినట్టున్నాడు."

"నేను వేదాంతినా కాదా అనేది పక్కనెడితే ఆడు మాత్రం పిచ్చోడు కాదు రావూ."

"బాగా చెప్పావు. అయితే ఆడికో పేరెడదాం. ఏ పేరైతే బాగుంటదబ్బా..? ఆఁ.. ఈరయ్య. ఇప్పటినుంచి ఆడిని కుంటి ఈరయ్య.. కాదు కాదు.. ఈరయ్య అనే పిలుద్దాం."

"మంచి మాటన్నావు."

ఇద్దరూ కాసేపు సైలెంట్‌గా కూర్చున్నారు. కాసేపటి తర్వాత "సరే, భోంచేద్దాం పద," అంటూ కుర్చీలోంచి లేచాడు కళ్యాణరావు.

"అబ్బే, లేదు. ఇంట్లో మా బామ్మర్ది గాడు, మీ చెల్లెలు ఏవో ఘుమఘుమలాడిస్తనారు. ఇంటికెళ్తాలే," అని బయలుదేరాడు గోపాలరావు.
ఇద్దరూ ఇంటి మెయిను గేటు దాకా నడిచారు. గేటు దాటి ఒక్క సెకను ఆగి వెనక్కి తిరిగి కళ్యాణరావువైపు చూస్తూ అడిగాడు గోపాలరావు.
"నన్ను ఇందాకటినుండి ఒక ధర్మ సందేహం పట్టి పీడించేస్తాంది. మన చిన్నప్పుడు ధర్మ ప్రభువు రామేశ్వరరావు గారు మనలాంటోళ్ళకి పూటకింత తినడానికి, చదువుకోడానికి డబ్బు సాయం చేసేవారు కదా. ఆ సాయం మనం ఎనకబడి ఉన్నామని చేసారా? ఎనకబాటుతనం నుంచి బయటకి వస్తన్నామని చేసారా?"
కళ్యాణరావు గోపాలరావు మొహంలోకి కాసేపు ఆలోచిస్తూ చూసి చెప్పాడు.
"మంచి డౌటే వచ్చింది నీకు. మహానుభావుడు.. ఆయనెందుకు చేసినా మనం ఎందుకు తీసుకున్నామనేదే తేల్చాలి. ఎందుకంటే.."
"..ఎందుకంటే ఎనకబాటుతనం క్వాలిఫికేషను కాదు. దాంట్లోంచి బయటకి రావడమే క్వాలిఫికేషను .." నవ్వుతూ పూర్తిచేసాడు గోపాలరావు.
ఇద్దరూ ఏదో ముఖ్యమైన విషయం అర్థమయినట్టు ఒకళ్ళనొకళ్ళు చూసి తలాడించారు.

-: మర్నాడు..:-
"కళ్యాణరావు గారూ, రంగూన్ రాజీబాబు ఫోను..," పొద్దున్నే అరుచుకుంటూ వార్త మోసుకొచ్చాడు పోతురాజు. ఇద్దరూ ఉరుకులు పరుగుల మీద పోస్టాఫీసుకి చేరుకున్నారు.
"ఒక స్కూలు ఉంటది. ఆ స్కూలు బయట ఒక పిచ్చోడుంటాడు. ఓ రోజు ఒకడు సైకిలు మీద ఎళ్తా అతన్ని గుద్దేస్తాడు..," గోపాలరావు ఫోన్లో రాజీబాబుతో మాట్లాడుతున్నాడు.

-:రచ్చబండ దగ్గర, కాసేపటి తర్వాత...:-
"ఆ పిచ్చోడి మాటలకి అర్థం ఏమిటా అని ఆ కేరక్టరు ఆలోచిస్తూ ఉంటది. అప్పుడు మనం ఒక క్లోజప్ షాట్‌తో కట్ చేస్తాం. క్లోజప్ షాట్‌తో ఎమోషన్ బాగా పండుద్ది," చుట్టూ ఉన్న అందరినీ మంత్రముగ్ధులని చేసేసి కథ వినిపిస్తున్నాడు గోపాలకృష్ణ.
"నిన్న మీ ఇంటి నుంచి బయలుదేరాకా దారిలో ఈడు తగిలాడు. 'రావులిద్దరూ ఇంకా స్టోరీ మీద కుస్తీ పడతనారా..' అని అడిగితే 'అవునురా, ఐడియాలే మీ రావట్లేద'ని చెప్పా. దానికాడేమన్నాడో తెలుసా.. 'కథ కోసం ఎక్కడో ఎతుకుతారెందుకండీ? నా జీవితమే ఒక సినిమా!' అన్నాడు. ఆడి జీవితం పూర్తి సినిమానా, లేకపోతే ట్రయల్‌పార్టా అనేది పక్కనెడితే ఆడి మాటలవల్లే నాకీ ఐడియా వచ్చింది. కథ కోసం ఎక్కడో ఎతకడం కంటే మన చుట్టూ ఉన్న వాటి మీదే కథ అల్లితే ఎట్టా ఉంటదా అని," ఆశ్చర్యంతో చూస్తున్న కళ్యాణరావుతో చెప్పాడు గోపాలరావు.
"ఐడియా గొప్పగానే ఉంది రావూ. కానీ అదేమంత ఈజీ కాదు. అయినా ఎవరి చుట్టూ అని అల్లుతాం?" అడిగాడు కళ్యాణరావు.
ఆ మాట వింటూనే చివాలున తల తిప్పి చూసాడు గోపాలకృష్ణ.
"ఒరే, నీకు సిన్నే చెప్పా. నీ చుట్టూ కథ అల్లితే ట్రయల్‌పార్ట్.. ఆఖరికి ట్రైలర్ కూడా రాదని," వెంటనే చెప్పాడు గోపాలరావు.
"అబ్బా, నా గురించి కాదండీ.. కుంటి పిచ్చోడు.. స్వారీ.. ఈరయ్య చుట్టూనే అల్లేయచ్చు కదా. ఇప్పుడూ.. ఒక పిచ్చోడున్నాడు. ఒక రాయి ఉంది. ఒక మనిషున్నాడు. పిచ్చోడు రాయిచ్చుకుని ఆ మనిషిని కొట్టాడు. ఇప్పుడు ఈ తింగరోడు దగ్గర రాయి ఉన్న పిచ్చోడి దగ్గరికి ఎందుకెళ్ళాడు, ఆ దెబ్బ తిన్న తర్వాత ఈడి జీవితంలో ఏమైంది.. అనే దాని మీద ఓ సినిమా తీయచ్చు. అది భీభత్సమైన ఫ్లాపవుద్ది.. అది వేరే ఇషయం. అదే ఆ పిచ్చోడు అసలు పిచ్చోడిలా ఎందుకు మారాడు, ఆడు పిచ్చోడిలా మారడానికి ముందు ఆడి జీవితం ఏంటి.. ఆడు పిచ్చోడిలా మారాకా ఆడి ఫ్యామిలీ జీవితం ఎట్టుంది.. ఈటి మీద సినిమా తియ్యండి. వంద.. వంద పడుద్ది," చాలా కన్విన్సింగ్‌గా చెప్పాడు గోపాలకృష్ణ.
అందరూ నిశ్శబ్దంగా విన్నారు. గోపాలరావు, కళ్యాణరావు ఒకళ్ళనొకళ్ళు చూసుకుని, గోపాలకృష్ణవైపు చూస్తూ ఒకేసారి 'ఏదాంతి..' అని గట్టిగా నవ్వారు.
"సరేరా, నీ ఐడియా కాదనడానికి నా దగ్గర ఇప్పుడు సరైన పాయింటు లేదు. నువ్వన్నట్టే ఈరయ్య చుట్టూనే కథ అల్లేద్దాం. మరి ఈరయ్య జీవితం గురించి తెలుసుకోవాలి కదా. పక్కోడి జీవితంలో వేలెట్టడంలో నిన్ను మించినోడు లేడు కాబట్టి ఆ పని నువ్వే చెయ్యి. ఏంటి? పోతురాజుగాడిని తీసుకుని పల్లంకుర్రు ఎళ్ళి.. శని, ఆదివారాలకల్లా మొత్తం తెలిసేసుకుని వచ్చేసావంటే ఓ పని అయిపోద్ది," అన్నాడు కళ్యాణరావు.

-: మర్నాడు పొద్దున్నే, రచ్చబండ దగ్గర:-
"ఈరయ్య అసలు పేరు అప్పాజీ. పాతికేళ్ళ క్రితం తన తమ్ముడు శ్రీపాదంతో కలిసి ఒక సైకిలు, ఓ చిన్న పెట్టితో పల్లంకుర్రు వచ్చాడు. వంద రూపాయిలతో రోజువారీ వడ్డీ వ్యాపారం మొదలెట్టి బాగానే సంపాదించాడు. ఓ ఇల్లు కట్టుకున్నాడు. శ్రీపాదం అప్పాజీకంటే పదిహేనేళ్ళు చిన్నోడు. మనిషి మంచోడే కానీ తక్కువ టైంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే మెంటాలిటీ. కానీ తమ్ముడంటే అప్పాజీకి ప్రాణం. అందుకే తను కష్టపడి సంపాదించిన డబ్బుని శ్రీపాదం 'తక్కువ టైంలో ఎక్కువ డబ్బు' వైపు వ్యాపారాల్లో పెడుతుంటే గట్టిగా ఏమీ అనలేక చూస్తూ ఊరుకునేవాడు. కొంతకాలానికి శ్రీపాదానికి మాలిని అనే ఆవిడతో పెళ్ళయింది. ఆవిడ అన్నిట్లోనూ మొగుణ్ణి మించిందే. ఊళ్ళో 'మహానటి' అని పిలిచేవారుట ఆవిడని. పెళ్ళైన కొన్ని రోజులకే మొగుడికి శుభ్రంగా బ్రెయిన్ వాష్ చేసి బావగారు సంపాదించిన డబ్బంతా పెట్టి అమలాపురంలో ఆవిడ ఫ్రెండు ఒకడితో కలిపి చిట్ ఫండ్ కంపెనీ పెట్టించిందిట. మరి ఏం జరిగిందో గానీ వ్యాపారంలో బాగా నష్టం

వచ్చింది. కష్టమర్లు రోజూ ఇంటి మీద, ఆఫీసు మీద దండెత్తేవారు. ఓ రోజు ఊరిజనం చూస్తుండగా అప్పాజీ ఎదురుగానే కష్టమర్లు శ్రీపాదాన్ని పట్టుకుని చితక్కొట్టారుట. ఆ అవమానం తట్టుకోలేక శ్రీపాదం గోదాట్లో దూకి ఆత్మహత్య చేసుకున్నాట్ట. దాంతో పాపం.. అప్పాజీ పిచ్చోడైపోయాడు," గుక్క తిప్పుకోకుండా తెలుసుకొచ్చినదంతా అప్పచెప్పేసాడు గోపాలకృష్ణ. అందరి మొహాల్లోనూ జాలి, బాధ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. చాలాసేపటి నిశ్శబ్దం తర్వాత కళ్యాణరావు మాట్లాడటం మొదలుపెట్టాడు.

"పాపం ఈరయ్య.. ప్రాణంలాంటి తమ్ముడిని పోగొట్టుకున్నాడు అన్యాయంగా, ఆ మహాతల్లి మూలంగా. అవున్రోరే, ఇప్పుడు ఆ పార్టనర్‌గాడినుంచి జనాలు డబ్బులు లాగలేదా? పల్లంకుర్రులో ఇల్లేమయింది?" అడిగాడు కళ్యాణరావు.

"అదేనండి విచిత్రం. లీగల్ డాక్యుమెంట్లలో ఆ పార్టనర్‌గాడి పేరే లేదంట. అంటే ఆడు కంపెనీలో భాగం అని చూపించడానికి ఏ ఆధారం లేదన్నమాట. ఇక ఇల్లేమో అప్పాజీ పేరు మీదగానీ, శ్రీపాదం పేరు మీదగానీ, ఈ మహానటి పేరు మీదగానీ లేదంట. దాంతో అంతా నోళ్ళు మూసుకుని కూర్చున్నారు," చెప్పాడు గోపాలకృష్ణ.

"విచిత్రంగా ఉందిరా.. మరి మహానటి ఏమయినట్టు? ఇప్పుడు ఆ ఇంట్లో ఎవరుంటున్నారు?" అడిగాడు గోపాలరావు.

"ఆవిడ ఊరొదిలి వెళ్ళిపోయిందంట. ఎక్కడికెళ్ళిందో ఎవరికీ తెలియదు. ఆ ఇల్లేమో ఈ మధ్యే ఎవరో కొనుక్కున్నారంట," చెప్పాడు పోతురాజు.

"ఇదిగో.. ఆళ్ళ పెళ్ళినాటి గ్రూపు ఫోటో సంపాదించా..," ఫోటో అందరికీ చూపిస్తూ అన్నాడు గోపాలకృష్ణ.

"పాపం మన కథలో అయినా ఈరయ్య కథకి మంచి ముగింపు ఇయ్యాల్రా," ఫోటోని చూస్తూ అన్నాడు గోపాలరావు.

-:మర్నాడు సాయంత్రం, గోపాలకృష్ణ మేనమామ సి.ఐ. సత్తిబాబు ఇల్లు:-

"కూర్చోరా గోపాలం.. వచ్చేస్తున్నా. అయిపోవచ్చింది. ఒక్కసారి చీపురేసేస్తే చాలు," కడిగిన గిన్నెలు లోపల పెడుతూ చెప్పాడు సత్తిబాబు.

"అదేమిటి మావయ్యా.. ఇంకా తెముల్చుకోలేదా? నాకు వంట కూడా అయిపోయింది," చెప్పాడు గోపాలకృష్ణ.

"ఏంటోరా.. ఇన్నేళ్ళ తర్వాత కూడా ఇంకా స్లోయే నేను. మీ అత్తయ్య కూడా అదే అంటుంది. 'గోపాలాన్ని చూడండి.. ఎంత త్వరగా తెముల్చుకుంటాడో పనులు' అని..," చెప్పాడు సత్తిబాబు.

కాసేపటి తర్వాత అన్ని పనులు ముగించుకుని కాఫీతో వచ్చాడు సత్తిబాబు.

"ఆఁ చెప్పరా.. ఎంతవరకు వచ్చిందేటి మీ కెజిపి వారి కథ.."

"ఏదీ, ఇంకా అల్లడం మొదలెట్టందే.. పల్లంకుర్రు నుంచి అంతా తెలుసుకొచ్చానా.. మీటింగెట్టి అందరికీ అప్పచెప్పానా.. ఇదిగో ఇప్పుడు నీతో మాట్లాడతన్నా..," కథాపర్యవేక్షణ అంతా తనదే అన్నట్టు ఎక్స్‌ప్రెషన్ పెట్టి చెప్పాడు గోపాలకృష్ణ.

"అసలు ఈరయ్య చుట్టూ సినిమా కథ అనే ఐడియా చాలా బాగుందిరా. అది నీకొచ్చిన ఐడియా అంటే నమ్మబుద్ధి కావట్లేదు," నవ్వుతూ అన్నాడు సత్తిబాబు.

"ఇదిగో, ఇది చూడు.. ఇది ఐడియాల పుట్ట. ఓ పది, పదిహేను ఆస్కార్లు పడతాయి లోపల. టైం రావాలంతే," తన బుర్రవైపు చూపిస్తూ అన్నాడు గోపాలకృష్ణ.

"బాగుందిరా అబ్బాయ్.. సరే. నిన్నిప్పుడో కొశ్చెన్ అడుగుతా. అది నీ కథకి ఓ కొత్త కోణాన్నిస్తది. అడగమంటావేటి?"

"హెడ్డు కానిస్టేబులు సి.ఐ. సత్తిబాబు అడిగి హెల్ప్ చేస్తానంటే కాదంటానా మావయ్యా? ఎంటనే అడిగేయ్.."

"ఏం హెడ్డో ఏంటో.. ఆ సి.ఐ. ఇంటి పేరులోనే మిగిలిపోయేలా ఉంది. సరే పోన్లే. ఇప్పుడూ అప్పాజీ.. అదే మీ ఈరయ్య.. అసలు మన వూళ్ళోకి ఎలా వచ్చాడో తెలుసా?"

".."

"నేనే చెప్తా గానీ ముందు నీకో వార్నింగివ్వాల.. కొన్ని కొన్ని నిజాలు తెలుసుకున్న తర్వాత జీవితం మీద నిజంగా విరక్తి కలుగుద్ది."

-:శివాలయం మెట్ల మీద, రెండు గంటల తర్వాత:-

"అవమానాలు తట్టుకోలేకో, అప్పులు, ఆకలి బాధలతోటో ఎవరో గోదాట్లోకి దూకి ఆత్మహత్య చేసుకుంటాడు. ఆ శవం కొట్టుకుంటూ వచ్చి ఏ గట్టు దగ్గరో చిక్కుబడుద్ది. అక్కడ ఒక మనిషుంటాడు. ఆడు కర్రతో శవాన్ని నీళ్ళలోకి నెడతాడు. మళ్ళీ శవం నీటిలో కొట్టుకుపోతూ ఉంటది. మళ్ళీ ఎక్కడో చిక్కుబడుద్ది. మళ్ళీ అక్కడ ఉన్న ఇంకోడూ దాన్ని నీళ్ళలోకి నెడతాడు. అలా నీళ్ళలోకి నెట్టడానికి అలాంటి మనిషి లేనిచోట ఈ శవం చిక్కుబడ్డప్పుడు ఏ మహానుభావుడో చూసి పోలీసోళ్ళని పిలుస్తాడు. అప్పుడిక పోస్టుమార్టం.. ఇంకా మిగిలిన పనులు తప్పవు ఆ ఊరి పోలీసోళ్ళకి," మొహాన్ని రెండు చేతుల మధ్య పెట్టుకుని గొంతులో వైరాగ్యంతో చెప్తున్నాడు గోపాలకృష్ణ.

"అంటే.. శ్రీపాదం శవం మన ఊళ్ళో తేలిందా? శీనుగాడి స్కూలు ఎదురుగా గవర్నమెంటు ఆస్పత్రి ఉంది. అంటే పాపం ఈరయ్య ఇన్నేళ్ళూ ఆ ఆస్పత్రి బయట..," ఆర్ధోక్తిలో ఆపాడు గోపాలరావు.

"..తమ్ముడి కోసం..," అని ఆగాడు కళ్యాణరావు.

ముగ్గురూ భారంగా నిట్టూర్చారు.

-:రెండు రోజుల తర్వాత. తెల్లవారుతూ ఉంది:-

'ఏవండోయ్ రావుగారూ..' అంటూ ఎవరో తలుపు తెగ బాదేస్తున్నారు. నిద్ర కళ్ళతో, అసహనంతో కళ్యాణరావు తలుపు తెరిచి చూసాడు: ఎదురుగా పళ్ళన్నీ కనిపించేలా నవ్వుతూ గోపాలకృష్ణ.

-:పావుగంట తర్వాత:-

'ఏవండోయ్ రావుగారూ..' అంటూ ఎవరో తలుపు తెగ బాదేస్తున్నారు. పట్టరాని కోపంతో గోపాలరావు తలుపు తెరిచి చూసాడు: ఎదురుగా మాడిపోయిన మొహంతో గోపాలకృష్ణ, స్థంభానికి ఆనుకుని నోట్లో వేపపుల్లతో కళ్యాణరావు.

"నిద్రలో లేపేసానని కోపమే గానీ ఇంటి పనులు మానుకుని ఇంత పొద్దున్నే వచ్చానంటే ఏదో బలమైన కారణం ఉండే ఉంటదనుకోరే?" అంటూ మొదలుపెట్టాడు గోపాలకృష్ణ.

గోపాలరావు ఇంటి పెరట్లో, గొడ్ల చావిడికి ఎదురుగా ఓ బల్లపై ఇద్దరు రావులూ దుప్పట్లు ముసుగేసుకుని గోపాలకృష్ణకి అటూ ఇటూ కూర్చుని ఉన్నారు.

"మీరు మాట్లాడే మూడ్‌లో లేరు.. నాకు తెలుసు.. కానీ ఇప్పుడు నేను చెప్పబోయేది.. కాదు కాదు.. చూపించబోయేది మీ నిద్ర మత్తు పూర్తిగా వదిలించేసుద్ది. మీరు ఎంతో ఉల్లాసంగా, ఎంతో ఉత్సాహంగా మారిపోతారు," హిప్నటైజ్ చేస్తున్నట్టు అంటూ ఒక ఫోటో వాళ్ళ ముందు పెట్టాడు గోపాలకృష్ణ.

ఆ ఫోటో చూస్తూనే బల్ల మీద నుంచి జారి పడ్డాడు కళ్యాణరావు. గోపాలరావు కూడా ఒక్క ఉదుటన బల్ల మీద నుంచి లేచి గోపాలకృష్ణవైపు కోపంగా చూడటం మొదలుపెట్టాడు.

"నువ్వసలు మనిషివేనేరా? తెల్లారగట్లే శవం ఫోటోతో వచ్చి నిద్ర లేపుతావా?" అంటూ తిట్లందుకున్నాడు కళ్యాణరావు. గోపాలరావు కూడా తన దుప్పటితో గోపాలకృష్ణని బాదడం మొదలుపెట్టాడు.

"ఆగండాగండి రావులూ.. ఆ ఒక్క ఫోటోనే చూసేసి ఆవేశపడితే ఎట్టా? ఇది కూడా చూడండి.. ఆలోచించండి," అంటూ ఇంకో ఫోటో వాళ్ళ ముందు పెట్టాడు గోపాలకృష్ణ.

అది శ్రీపాదం పెళ్ళినాటి గ్రూపు ఫోటో.

"ఇది అల్రెడీ చూసిందే కదరా తింగరోడా," అంటూ ఆ ఫోటోని బల్ల మీదకి విసిరాడు గోపాలరావు.

"అవును చూసిందేనండీ. కానీ ఇప్పటిదాకా రెండు ఫోటోలని కలిపి చూడలేదు కదా..," అంటూ సాగదీయబోయాడు గోపాలకృష్ణ.

"ఒరే, నీకు సరిగ్గా రెండు నిమిషాలు టైమిస్తన్నా. అంటే నూట ఇరవై సెకన్లు. ఈ టైములో విషయం తేల్చకపోతే ఆ తర్వాత నీ విషయం నేను తేలుస్తా," చాలా సీరియస్‌గా వార్నింగిచ్చాడు కళ్యాణరావు.

"సరే సరే సరే.. మీరు చూసిన ఆ ఫోటో పోలీసు రికార్డుల్లో ఉన్న శ్రీపాదందండి. పోస్టుమార్టానికి ముందు తీసింది. ఆ ఫోటోని, గ్రూపు ఫోటోలోని శ్రీపాదాన్ని బాగా వొళ్ళు దగ్గరెట్టి.. స్వారీ.. కళ్ళు దగ్గరెట్టి చూడండి. నేను ఇప్పుడే వస్తా," గొడ్ల చావిడిలోని ఓ గేదె చుట్టూ జేబులో చేతులు పెట్టుకుని తిరుగుతూ చెప్పి బాత్రూంవైపు వెళ్ళబోయాడు గోపాలకృష్ణ.

"ఎక్కడికిరా జారుకుంటున్నావ్? నీకింకా పాతిక సెకన్లే ఉంది," అంటూ కాలర్ పట్టుకుని ఆపాడు కళ్యాణరావు.

"పొద్దున్నే బుర్ర ఉపయోగించమన్నానని కోపం వచ్చిందా? సరే వద్దే.. నేనే చెప్పేస్తా..," చిన్న పిల్లల్ని ముద్దు చేస్తున్నట్టు చెప్పి మొదలుపెట్టాడు గోపాలకృష్ణ.

"మహాజనులారా.. ఒకటో నెంబరు ఫోటోలోని మనిషి కుడి కాలుని, రెండో నెంబరు ఫోటోలోని శ్రీపాదం కుడి కాలుని పరీక్షించి చూడండి. రెండో నెంబరుకి ఐదు వేళ్ళే ఉన్నాయి. కానీ ఒకటో నెంబరుకి అలా కాదే: ఆ....రు వేళ్ళున్నాయి. దీన్ని బట్టి మనకి తెలిసేది ఏంటన్నమాట? ఆగండాగండి.. ఒకటో నెంబరు ఫోటో శ్రీపాదానిది కాదు.. నా కష్టమరు ఎవరిదో అని చెప్పబోతున్నారు కదా. నాకు తెలుసండీ. ఆ ఫోటో ఎనక్కి తిప్పి చూడండి. ప్రభుత్వం వారి ముద్ర, కేసు నెంబరు, డేటు ఉన్నాయా లేవా? అన్నట్టు ఆ ఫోటో చాలా కిందా మీదా పడి సంపాదించా.. మా సత్తిబాబు మావయ్య కాళ్ళట్టుకుని. ఇప్పుడు చెప్పండి రావుల్లారా.. ఏం తెలిసింది మనకి? ఏం తెలిసిందని అడుగుతున్నాను నేను," రాజకీయ నాయకుడి ఉపన్యాసంలా చెప్పి ఇద్దరివైపు మార్చి మార్చి చూస్తూ సమాధానం కోసం ఎదురు చూడసాగాడు గోపాలకృష్ణ.

గోపాలకృష్ణ చెప్పింది నిజమే. రావులిద్దరికీ నిద్ర ఎగిరిపోయింది. ఇద్దరూ రెండు ఫోటోలని చాలాసేపు పరీక్షగా చూసి గోపాలకృష్ణవైపు మెచ్చుకోలుగా చూసారు.

"చూడ్డానికలా కనపడతావు గానీ ఒరే.. మతిలేనోడివి కాదు నువ్వు - మామూలోడివి కాదు; మాయలోడివి నువ్వు - మా గొప్ప మేధావివి," అంటూ ఆశు కవిత్వం అందుకున్నాడు గోపాలరావు.

"రావులా కవితలు చెప్పలేను గానీరా ఒరే.. గొప్ప మలుపు తిప్పావురా కథని. ఆ శవం శ్రీపాదానిది కాదని కన్‌ఫర్మ్ చేసుకోడానికి నాకో కత్తిలాంటి ఐడియా తట్టింది," కళ్ళు చిన్నవి చేసి గడ్డం గోక్కుంటూ అన్నాడు కళ్యాణరావు.

-:కొన్ని గంటల తర్వాత, శీనుగాడి స్కూలు దగ్గర:-

ఓ పిల్లాడు చేతిలో ఏదో పట్టుకుని ఈరయ్యవైపు వెళ్తున్నాడు. దగ్గరికంటా వెళ్ళి ఈరయ్య చూస్తుండగా ఏదో కాగితంలాంటి దాన్ని తన ముందు పడేసాడు. ఈరయ్య కాసేపు పిల్లాడివైపు చూసి, ఆ కాగితాన్ని దగ్గరికంటా తీసుకుని చాలాసేపు పరీక్షగా చూసి, కాసేపటి తర్వాత పక్కకి పడేసాడు. అది గోపాలకృష్ణ సంపాదించిన శవం ఫోటో.

దూరంగా మర్రిచెట్టు వెనకనుంచి చూస్తున్న గోపాలరావు, కళ్యాణరావు, గోపాలకృష్ణ, పోతురాజు ఎగిరి గంతేసారు.

"ఇప్పుడు చూడండ్రా కథ ఎలా ముందుకెళ్ళుద్దో.. ఆ శవం శ్రీపాదానిది కాకపోయినా పోలీసు రికార్డుల్లో అలాగే ఉంది కాబట్టి.. ఒరే గోపాలకృష్ణా.. మీ సత్తిబాబు మావయ్యని పట్టుకుని ఈ కేసు గురించి ఇంకొంచెం మేటరు సంపాదించగలవేమో చూడు, ఏంటి?

పోతురాజూ.. నువ్వేం చేస్తావంటే.. కొన్ని రోజులు పల్లంకుర్రులో మకాం పెట్టు. ఆ ఇంటి మీద బాగా నిఘా పెట్టామంటే ఏదో ఒకటి దొరకచ్చు మనకి. నేను, రావు అమలాపురంలో ఆళ్ల కంపెనీ అసలు ఎట్టా రిజిష్టరు చేసారు, మూసేసాకా ఏమైంది.. ఇవన్నీ తెల్సుకొస్తాం. ఏంటి?" పూర్తి కాన్ఫిడెన్స్‌తో ఎవరెవరు ఏం చెయ్యాలో చెప్పాడు కళ్యాణరావు.

ఆ మర్నాటినుంచి అంతా ఇన్వెస్టిగేటర్ల అవతారం ఎత్తారు. రెండు కవితలు, నాలుగు రౌండుల పేకాటతో గోపాలరావు, కళ్యాణరావులు ఆ కంపెనీ రిజిస్ట్రేషన్‌కి సంబంధించిన విషయాలన్నీ కూపీ లాగారు. రికార్డుల్లో శ్రీపాదం, సోమరాజు అనే ఇంకో వ్యక్తి ఆ కంపెనీ ఓనర్లుగా ఉంది. వాటిలో ఉన్న అడ్రస్‌లో అడిగి చూస్తే అసలు ఆ పేరుతో అక్కడ ఎవరూ లేరని తెలిసింది. ఇంకా కొన్ని ప్రయత్నాలు చేసి రావులిద్దరూ నిరాశగా వెనక్కి తిరిగి వచ్చారు. గోపాలకృష్ణ కూడా పెద్దగా ఉపయోగపడే విషయాలేమీ సేకరించలేకపోయాడు. పోతురాజు ఇస్త్రీ బండబ్బాయి అవతారం ఎత్తి పల్లంకుర్రులో శ్రీపాదం వాళ్ళ ఇంటి ముందు వారం రోజులు కాపు కాసి, ఉట్టి చేతులతో వెనక్కి తిరిగి వచ్చాడు.

ఓ ఆదివారం పొద్దున్న మళ్ళీ అంతా రచ్చబండ దగ్గర సమావేశమయ్యారు. ఆ వారం రోజులు వాళ్ళు చేసిన ప్రయత్నాల గురించి, కనుక్కొన్న విషయాల గురించి చర్చించి సాధించింది ఏమీ లేదని తేల్చేసారు.

"ఏడిసినట్టే ఉంది. మళ్ళీ మొదటికొచ్చాం. అనవసరంగా నా కవితలు రెండు వేస్ట్ చేసాను కూడా," అన్నాడు గోపాలరావు నిరాశతో.

"మీరు కవితలకే బాధ పడిపోతే నా పరిస్థితేంటీ? వారం రోజులు స్టూడియో మూసేసాను. బిజినెస్ అంతా లాసు," మీకన్నా నా లాసే పెద్దదన్నట్టు చెప్పాడు గోపాలకృష్ణ.

అంతా కోపంగా గోపాలకృష్ణవైపు చూసారు.

"లాసంటే పెద్ద లాసు కాదు లెండి. మళ్ళీ సీజనొస్తోందిగా కవర్ చేసేత్తాలెండి. ఇహిహి," వెకిలి నవ్వు నవ్వుతూ చెప్పాడు గోపాలకృష్ణ.

"నేనో నాలుగు చొక్కాలు, రెండు చీరలు కాల్చేసానండీ..," తన ప్రోగ్రెస్ కూడా చెప్పాడు పోతురాజు.

"ఇలా కాదు గానీరా.. కథలో ఎలాగో ట్విస్టు దొరికేసింది కాబట్టి ఇక్కడి నుంచి సొంతంగా అల్లేద్దాం. మహానటి ఎలాగో తేడా మనిషని తెలిసింది కాబట్టి.. ఆవిడ, ఆవిడ ఫ్రెండు ఆ సోమరాజుగాడు కలిసి శ్రీపాదాన్ని చంపబోయినట్టు, శ్రీపాదం తప్పించుకుని పారిపోయినట్టు, చివరికి ఆళ్ళమీద పగ తీర్చుకున్నట్టు చూపిత్తే ఎట్టా ఉంటది?" గోపాలరావు ఆశువుగా కవితల్లినట్టు కథ అల్లేసాడు కళ్యాణరావు.

అంతా బుర్ర ఊపుతూ కాసేపు ఆలోచించారు.

"బాగానే ఉంటదనిపిస్తోంది..," చెప్పాడు గోపాలరావు.

"మహానటి మొగుణ్ణి చంపేటైపు కేరక్టరని జనాలు నమ్మాలంటే ముందు నుంచీ కొంచెం ఆడ ఇలనులా చూపించాలి," పెద్ద సలహా ఇచ్చాడు గోపాలకృష్ణ.

"'నీదీ ఓ బతుకేనా..' సీరియల్లో చండీరాణి లాగానాండీ?" అడిగాడు అప్పుడే టీలు పట్టుకొచ్చిన చిన్నిగాడు.

ఆ ప్రశ్నతో అంతా ఆలోచనలో పడ్డారు.

"పోనీ, మహానటిని ఇలనులా చూపించకపోయినా కొంచెం తేడా మనిషిలా చూపించి ఆ సోమరాజుగాడిని చెడ్డోడిని చేసేస్తే.. చెయ్యడమేంట్లే.. ఆడెలాగో చెడ్డోడేగా. ఆడు మహానటి మీద కన్నేసాడని.. శ్రీపాదాన్ని సైడు చెయ్యడానికి ట్రై చేసాడని చూపిత్తే ఎట్టా ఉంటది?" అడిగాడు గోపాలకృష్ణ.

"ఇలాంటి ఆలోచనల్లో ఎవడైనా నీ తర్వాతేరా..," అన్నాడు గోపాలరావు.

"సోమరాజుగాడు చెడ్డోడైతే ఆడు మహానటి మీద డబ్బు కోసం కన్నేసినట్టు చూపించాలి. అంటే ఆ కంపెనీ డబ్బంతా ఆడు నొక్కేసినట్టు అట్టా.." అన్నాడు కళ్యాణరావు.

"బాగానే ఉంది కానీ.. బొత్తిగా రొటీనుగా ఉందండీ.. కాస్త మసాలా ఉండాలి కదా ఇట్టాంటి కథకి.. ఎవడయినా కనిపెట్టేసేలా ఉంటే ఎట్టా?" పాయింటు లాగాడు పోతురాజు రింగులు రింగులుగా చుట్ట పొగ ఊదుతూ.

"ఏంట్రోయ్.. రింగులు బాగానే చుడతన్నావుగా.. ఈ విద్య ఏడ నేర్చావేటి కొత్తగా..," ఆశ్చర్యంగా అడిగాడు గోపాలకృష్ణ.

"ఆఁ, ఏదో లెండి. పల్లంకుర్రులో ఓ ఎల్.ఐ.సి ఏజెంటుని చూసి పట్టా. నా మానాన్న నేను ఇస్త్రీ చేసుకుంటంటే ఆడొచ్చి శ్రీపాదం గురించి, మహానటి గురించి ఆళ్ళెక్కడికి పోయారు ఇట్టాంటి సోదంతా అడిగాడు. నాకు చిర్రెత్తుకొచ్చింది. అది తెలుసుకోడానికే కిందా మీదా పడి నేను ట్రై చేస్తాంటే ఇప్పుడొచ్చి ఈడి గోలేంటా అని తిట్టుకున్నా. కానీ ఆడు గొప్ప సొగసుగా రింగులు సుడతాడండి..," చెప్పాడు పోతురాజు ఇంకాసిని రింగులు వదులుతూ.

పోతురాజు మాటల్లో ఏదో క్లూ దొరికినట్టు ముందు కళ్యాణరావు కళ్ళు పెద్దవి చేస్తూ పోతురాజువైపు చూసాడు. కాసేపటికి గోపాలరావుకి, ఆ తర్వాత కాసేపటికి గోపాలకృష్ణకి లైటు వెలిగి వాళ్ళు కూడా పోతురాజువైపు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేస్తూ చూసారు. వాళ్ళ మొహాల్లో ఎక్స్‌ప్రెషన్స్‌నేమీ పట్టిచ్చుకోకుండా తన దారిన తాను నవ్వుకుంటూ రింగులు వదులుతున్నాడు పోతురాజు.

"ఒరే...... పోతురాజూ........," అంటూ పోతురాజు మెడ పట్టుకుని కోపంతో గట్టిగా ఊపేసాడు గోపాలకృష్ణ. ఆ ఊపుడుకి పోతురాజు నోట్లోంచి చుట్ట జారి వొళ్ళో పడింది.

చుట్ట చురుక్కుమనేసరికి గతుక్కుమని లేచి "అయ్‌బాబోయ్.. పీక నొక్కేత్తారేంటండీ బాబూ.. ఏంటి.. రింగులేనా.. మీకూ నేర్పుతానండీ కావాలంటేనీ..," అన్నాడు పోతురాజు.

"రింగులేంట్రా.. తింగర నా.. స్టోరీ అంగుళం ముందుకెళ్ళక అంతా ఏడుత్తాంటే ఆ ఎల్.ఐ.సి ఏజెంటు విషయం చెప్పకుండా చీరలు, చెడ్డీలు కాల్చేసానని సోది చెప్తావా..?" అన్నాడు గోపాలకృష్ణ కోపంతో ఊగిపోతూ.

"ఊరుకోరారే గోపాలకృష్ణా.. ఆడితో మనకిప్పుడు చాలా పనుంది గానీ ముందు దీని మీద బుర్రెడదాం. తస్సాదియ్యా.. ఎల్.ఐ.సి! అంటే

శ్రీపాదం పేరు మీద పాలసీ తీసుకుని తనని చంపేసి ఆ డబ్బుతో ఇద్దరూ చెక్కేద్దామని ప్లానేసి ఉంటారు. శ్రీపాదాన్ని చంపేసారో, లేకపోతే ఎవరో శవాన్ని శ్రీపాదానిదని చూపించేసి రికార్డులు మాయించేసారో తెలీదుగానీ.. ఇప్పుడు ఆ ఎల్.ఐ.సి రింగు మాస్టర్ని పట్టుకుంటే పెద్ద మిస్టరీ ఇడిపోద్ది," చెప్పాడు కళ్యాణరావు.

"ఆ ఎల్.ఐ.సి కంపెనీ డబ్బెవరికిచ్చిందో ఆళ్ళ అడ్రసు పట్టుకుంటే ఆళ్ళని నాలుగు పీకి అసలు శ్రీపాదాన్నేం చేసారో కూడా తెలుసుకోచ్చు," ఇంకో పాయింటు చెప్పాడు గోపాలరావు.

అప్పటికి పోతురాజుకి లైటు వెలిగింది.

"అంటే, ఆడు ఇంకో పాలసీ అంటగట్టడానికి వచ్చాడన్నమాట అప్పుడక్కడికి. ఓర్ని.. ఇదో గొప్ప బిజినెసండీ.. నాకసలు అర్ధం కాదు.. 'నువ్వు పోయాకా..' అంటూ మొదలెట్టి జనాలనెలా ఒప్పిత్తారో అసలు..," అంటూ చిన్నప్పటినుండి తనకున్న సందేహాన్ని వ్యక్తం చేసాడు పోతురాజు.

"ఆఁ ఆఁ.. ఏడిసావు గానీ.. ముందు ఆ రింగు మాస్టరుగాడిని పట్టుకో. ఇస్త్రీ బండోడి అవతారం ఎత్తుతావో.. ఇంటింటికీ తిరిగి చుట్టలే అమ్ముతావో.. రెండు రోజుల్లో ఆడి గురించి మేటరు సంపాదించలేదనుకో..," వార్నింగిచ్చాడు గోపాలకృష్ణ.

"అబ్బా ఊరుకోండీ.. ఈసారి చూడండి.. చించేత్తాను. ఆడిని పట్టుకోడం చాలా వీజీ. ఇందాకా ఓ చుట్ట కాల్చాను చూసారా.. అది ఆడి దగ్గర కొట్టేసిందే. ఆ చుట్టలు ఆడు పల్లంకుర్రులో చుట్టల చిన్నబ్బాయి దగ్గర కొంటాడంట. నేను ఇప్పుడు డైరెక్టు ఆడి దగ్గరికి ఎళ్ళిపోయి ఓ రెండు చుట్టలు కొనేసి ఆడి కాళ్ళట్టేసుకున్నాననుకోండి.. రింగు మాస్టరి అడ్రసు దొరికేద్ది," సింపుల్ ఐడియాతో అందరికీ షాకిచ్చాడు పోతురాజు.

"సిన్ని చుట్ట చుట్టూ మర్డరు కేసు గొప్పగా చెట్టేసావురా పోతురాజా..," అంటూ మెచ్చుకున్నాడు గోపాలరావు.

చెప్పినట్టుగానే రింగు మాస్టరి అడ్రసు 'వీజీగానే' పట్టుకున్నాడు పోతురాజు. అతని పేరు ఏకాంబరం, ఏజెంట్ ఏకాంబరం. అడ్రసు తెలియగానే ఆఘమేఘాల మీద అంతా దండయాత్రకి బయలుదేరారు. రెండు డజన్ల చుట్టలు సమర్పించుకుని, అందరూ తలో పాలసీ తీసుకున్న తర్వాత నోరు విప్పాడు ఏకాంబరం.

"చాలా కష్టపడొచ్చారయ్యా మీరు.. కానీ నేను కేవలం పాలసీలు అమ్ముతాను. డబ్బుల చెల్లింపులు, కేసులు ఇన్వెస్టిగేషను చెయ్యడాలు ఇట్టాంటివన్నీ కంపెనీ చూసుకుంటాది. మరి అదీ సంగతి," అంటూ చల్లగా చెప్పాడు ఏకాంబరం.

పోతురాజు వెంటనే కోపంతో చుట్టలు, పాలసీ పేపర్లు లాగేసుకోబోయాడు. గోపాలకృష్ణ అడ్డుపడి ఏకాంబరం దగ్గరగా కుర్చీ జరుపుకుని మాట్లాడటం మొదలుపెట్టాడు.

"అదట్టా ఉంచండి గానీ ఏకాంబరంగారూ.. మీకోటి చెప్పాలండీ.. మీ మాటల్లో, కూర్చున్న ఫోజులో, ఆ చుట్ట పట్టుకోడంలో, కాల్చడంలో, రింగులు రింగులుగా పొగ ఊదడంలో అన్నిట్లోనూ.. అన్నిట్లోనూ నాకో స్టైలు కనిపిస్తాందండీ. మీకీ మాట చాలామంది చెప్పే ఉంటారు.. మీరు గనక సినిమాల్లోకొస్తే.. పెద్ద స్టైలు కింగ్ అయిపోతారండీ..," అన్నాడు గోపాలకృష్ణ ఏకాంబరం మొహం ఎదురుగా మొహం పెట్టి.

ఆ మాటలకి చాలా స్టైలిష్‌గా కుర్చీలో కదిలి, చుట్ట చెయ్యి మార్చి, అన్ని డైరెక్షన్స్‌లోనూ రింగులు వదిలి "ఆఁ ఆఁ, ఇదే మాట చాలామంది అన్నారు. కానీ నాకెందుకో సినిమాలంటే పెద్ద ఇంట్రెస్టు లేదు. మీరు కాదూ కూడదంటే మీ సినిమాతోనే చిన్నగా మొదలెడదాం. ఏమంటారు?" అన్నాడు ఏకాంబరం.

గోపాలకృష్ణ సరిగ్గా ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాడని అర్ధమైంది రావులిద్దరికీ. వెంటనే కళ్యాణరావు అందుకున్నాడు.

"అంతకంటే మాక్కావల్సిందేముందండీ.. కాకపోతే మరి కథ ముందుకెళ్ళేలా కనిపించట్లేదు. ఆ ఎల్.ఐ.సి డబ్బులు ఎవరికెళ్ళాయో తేల్తే గానీ మరి..," అని ఆపాడు కళ్యాణరావు.

"సరే ఏదో మా ప్రయత్నం మేం చేస్తాం లెండి..," అంటూ కుర్చీలోనుంచి లేవబోయాడు గోపాలరావు.

"కూర్చోండయ్యా.. ఎక్కడికెళ్తారు.. ఏజెంట్ ఏకాంబరంతో చెప్పారు కదా.. ఇక మర్చిపోవడమే దాని గురించి. ఏంటి?" అంటూ తిన్నగా లైనులోకొచ్చాడు ఏకాంబరం.

ఇంకాసేపు పొగిడి, జేమ్స్ బాండ్ స్టైల్లో నాలుగైదు డైలాగులు చెప్పించి, పరిగెడుతూ చుట్ట నోట్లోకి విసురుకోవడంలాంటి సీనులు చేయించి ఏకాంబరాన్ని అంతా కలిసి మునగచెట్టు చివరి కొమ్మదాకా ఎత్తేసారు. ఆ ఆనందం మత్తులో ఊగుతున్నప్పుడే కొన్ని ఫోనులు చేయించి తమక్కావల్సినదంతా సంపాదించి అక్కడినుంచి విజయగర్వంతో బయలుదేరారు నలుగురూ.

ఏకాంబరం ఇచ్చిన వివరాల ప్రకారం ఆ ఎల్.ఐ.సి డబ్బులు పార్వతీశం అనే వ్యక్తికి చెల్లించడం జరిగింది. అతని ఇల్లు రావులపాలెం శివార్లలోని ఓ రెండతస్థుల మేడ. నలుగురూ కలిసి ఈజీగానే ఆ ఇంటిని పట్టుకున్నారు. ఆ ఇంటి ఎదురుగా ఉన్న ఓ పాడుబడ్డ ఇంట్లో మకాం పెట్టి ఆ ఇంటిపై పూర్తి నిఘా పెట్టారు. గోపాలకృష్ణ, పోతురాజు కలిసి ఆ ఇంట్లో ఒక ఆడ, ఒక మగ ఉంటున్నట్టు తేల్చారు. ఆ మగ మనిషి పార్వతీశం గానీ, సోమరాజు గానీ అయి ఉంటారని, ఆ ఆడావిడ మహానటి అయి ఉంటుందని తేల్చారు నలుగురు కలిసి. అది కన్ఫర్మ్ చేసుకోవడానికి ఓ ఐడియా వచ్చింది గోపాలకృష్ణకి. ఉరుకులు పరుగుల మీద ఇంటికి వెళ్ళి తను కొత్తగా కొన్న టెలీస్కోపిక్ లెన్స్ ఉన్న కెమెరా తీసుకుని వచ్చాడు. ఒక ఇరవై షాట్ల తర్వాత ఆ ఆడ మనిషి మొహం క్లోజప్‌లో ఫోటో తీయగలిగాడు.

వాళ్ళు ఊహించింది కరెక్టే! ఆమే మహానటి, మాలిని.

ఓ రోజు సాయంత్రం చీకటి పడుతూ ఉండగా ఆ మగ మనిషి స్కూటరు మీద ఎక్కడికో వెళ్ళాడు. రాత్రైనా తిరిగి రాలేదు. గోపాలకృష్ణ కెమెరాతో షిఫ్టుల వారీగా ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు రెప్ప వేయకుండా ఆ ఇంటివైపు చూస్తూనే ఉన్నారు.

టైం పదకొండు కావస్తోంది. గోపాలకృష్ణ డ్యూటీలో ఉన్నాడు. మిగిలిన ముగ్గురు అప్పుడే ముసుగు తన్నేసారు.

టీ తెచ్చుకోడానికి లేద్దామనుకుంటూ ఉండగా ఎదురింట్లో ఏదో ఆకారం కదులుతున్నట్లు కనిపించింది గోపాలకృష్ణకి. గుండె చిక్కబట్టుకుని చూడసాగాడు. ఎవరో మగ మనిషి. బాత్రూం వైపు ద్వారా పైకెక్కుతున్నాడు. దొంగేమో అనుకున్నాడు ముందు. కెమెరా

బాగా జూమ్ చేసి అతని మొహం చూడటానికి ట్రై చేసాడు. అతను మేడపైకి ఎక్కి, చీకట్లో దాక్కున్నాడు. చాలాసేపటి తర్వాత ఒక్క అరసెకను పాటు అతని మొహం కనిపించింది. కాసేపు గుండె కొట్టుకోవడం ఆగింది గోపాలకృష్ణకి.
ఆ వ్యక్తి శ్రీపాదం.
వెంటనే ముగ్గురినీ నిద్ర లేపి విషయం చెప్పాడు. అందరికీ ఒక్క దెబ్బతో నిద్ర ఎగిరిపోయింది.
"ఈ అవకాశాన్ని వదులుకోకూడదురా. ఏదైతే అదవుద్ది. నేను, రావు కలిసి ఆ ఇంట్లోకెళ్తాం. నువ్వు కెమెరాలోంచి చూస్తూ ఉండు. ఏది ముఖ్యమైందనిపించినా ఫోటో లాగేయ్. పోతురాజూ.. నువ్వు ప్రహారీ గోడ దగ్గర కాసుకో," అని చెప్పి గోపాలరావుతో కలిసి ఓ తాడు తీసుకుని ఆ ఇంటివైపు పరిగెత్తాడు కళ్యాణరావు. పోతురాజు కూడా ఓ కర్ర పట్టుకుని బయలుదేరాడు.
కళ్యాణరావు, గోపాలరావులు నిశ్శబ్దంగా ఆ ఇంటి దొడ్డివైపు నుంచి పైకి ఎక్కి చీకట్లో దూరంగా నిల్చుని శ్రీపాదాన్నే చూడసాగారు. శ్రీపాదం మెల్లగా ఓ కిటికీలోనుంచి లోపలకి దూరాడు. కాసేపటి తర్వాత మెట్లు దిగుతున్న శబ్దం విని కళ్యాణరావు, గోపాలరావులు కూడా నిశ్శబ్దంగా తనని ఫాలో అయ్యారు.
కింద మహానటి గదిలోకి వెళ్ళి తన బెడ్ ముందు రెండు చేతులు కట్టుకుని తననే చూస్తూ కాసేపు నిల్చున్నాడు శ్రీపాదం. తర్వాత బెడ్ చుట్టూ ఒకసారి తిరిగి తన తల దగ్గర టేబుల్‌పై ఉన్న ఫ్లవర్‌వాజుని తీసుకుని కింద పడేసాడు. ఆ శబ్దానికి ఉలిక్కిపడి లేచి గట్టిగా అరవడం ప్రారంభించింది మహానటి. శ్రీపాదం నెమ్మదిగా నడుస్తూ లైటు ఆన్ చేసాడు. కళ్యాణరావు, గోపాలరావులు గుండె చిక్కబట్టుకుని దూరంగా చీకట్లో దాక్కుని చూస్తున్నారు.
శ్రీపాదాన్ని చూసి తను వెంటనే అరవడం ఆపేసి, గొంతులో ఎటువంటి ఫీలింగూ లేకుండా, "నువ్వా? నీ కథ ముగిసిపోయిందని ఇదివరకే చెప్పా కదా. మళ్ళెందుకొచ్చావు? వెళ్తే పడుకుంటాను. రాత్రి ఎనిమిది గంటలు నిద్ర లేకపోతే నాకు పొద్దున్న కష్టమవుద్ది మళ్ళీ," అని బెడ్ మీద కూర్చుంది.
శ్రీపాదం నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి తనకి ఎదురుగా గోడకి ఆనుకుని నేల మీద కూర్చుని మాట్లాడటం మొదలుపెట్టాడు.
"ఆఁ.. ఆఁ.. అవును. అవునవును.. చెప్పావు. చిన్నప్పటినుంచి మా అన్నయ్య కూడా ఓ కథ చెప్పేవాడు. ఆ కథలో ప్రాణం పెట్టే ఓ అన్నయ్య, ప్రాణంలా ప్రేమించే భార్య, ఓ చిన్న ఇల్లు, సుఖంగా గడపడానికి సరిపడా సంపాదన.. వీటన్నిటితో ఓ మనిషి హాయిగా జీవితం గడిపేవాడు. కానీ నాకా కథ ఎప్పుడూ నచ్చేది కాదు. నీతో పరిచయమయ్యాకా నువ్వు చెప్పిన కథ నచ్చింది. నీ కథలో లెక్కలేనన్ని విలాసాలు, లెక్కపెట్టలేనంత డబ్బు, బోలెడు హోదా.. అన్నీ ఉండేవి. నీ కథే విన్నాను. ప్రాణం పెట్టే అన్నయ్య దూరమైపోయాడు. ప్రాణాన్నే ఇచ్చినా భార్య ప్రేమించలేదు. ఇల్లు పోయింది. రక్తం ధారపోసి అన్నయ్య సంపాదించినదంతా పోయింది. రాళ్ళు కొట్టి, అడుక్కుతిని బతుకుతున్నాను. అదే నా కథకి ముగింపు అన్నావు. తేనె లేని పువ్వు దగ్గరికి తుమ్మెద రాదన్నావు. తప్పు తుమ్మెదది కాదన్నావు. ఆ పువ్వు దేవుడి ముందు పెట్టడానికి తప్ప దేనికీ పనికి రాదన్నావు. కానీ.. కానీ నీ కథకి ముగింపు చెప్పలేదు. అది చెప్పడానికే నేనొచ్చాను. ఇప్పుడు నిన్ను చంపేస్తాను. తేనె లేని పువ్వుని చచ్చిపోయిన వాళ్ళ ఫోటోకి కూడా పెట్టొచ్చు," అని సడెన్‌గా కింద ఉన్న గాజు పెంకు తీసుకుని మహానటి మీదకి దూకాడు శ్రీపాదం. ఆ గాజు పెంకు తన భుజంలో దిగబడి గట్టిగా అరిచింది మహానటి. ఇక ఆలస్యం చెయ్యకుండా వెంటనే పరిగెత్తుకుంటూ వచ్చి శ్రీపాదంపై పడి తనని వెనక్కి లాగేసారు కళ్యాణరావు, గోపాలరావులు.

-:తెల్లవారుతూ ఉండగా..:-

వ్యానులో చేతులు కట్టేసి శ్రీపాదాన్ని, భుజానికి కట్టు కట్టి, మత్తు ఇంజెక్షను ఇచ్చి మహానటిని తీసుకుని నలుగురూ ఇంటికి బయలుదేరారు. దారిలో తన కథ చెప్పడం మొదలుపెట్టాడు శ్రీపాదం.
"నేను, ఆ పార్వతీశంగాడు కలిసి ఆ చిట్ ఫండ్ కంపెనీ పెట్టాం. వాడో పెద్ద ఫ్రాడ్. ఈవిడని మించినోడు. కళ్ళు మూసి తెరిచేలోపు కష్టమర్లనుండి సేకరించిన డబ్బంతా నొక్కేసాడు. కంపెనీ నష్టాల్లోకి వెళ్ళి మూతబడే టైముకి మాయ చేసి కంపెనీ డాక్యుమెంట్లన్నీ మార్చేసాడు. పార్టనర్ కింద తన పేరు తీసేసి సోమరాజు పేరు పెట్టాడు. పాపం సోమరాజు అనాథ. చాలా మంచోడు. అమాయకుడు. కష్టమర్లు డబ్బు కోసం కంపెనీ చుట్టూ తిరగడం మొదలెట్టారు. పాపం సోమరాజు వాళ్ళకి రోజూ సర్ది చెప్పి పంపేవాడు. కానీ కష్టమర్లని రెచ్చగొట్టడం కోసం ఓ రోజు పార్వతీశం కొంతమంది జనాలని కష్టమర్ల కింద పంపించి మా అన్నయ్య ముందే నన్ను కొట్టించాడు. ఆ రోజు నిజంగా నాకు చచ్చిపోవాలనిపించింది. అన్నయ్యకి మొహం చూపించలేకపోయాను. పల్లంకుర్రు నుంచి పారిపోయాను. ఇంత జరిగినా ఇందులో మాలిని హ్యాండుందని నాకనిపించలేదు. పిచ్చోడిని. అప్పుడప్పుడూ సీక్రెట్‌గా మాలినిని కలుస్తూ ఉండేవాడిని. ఓ రోజు తను నాకో సలహా ఇచ్చింది. నా పేరు మీద ఎల్.ఐ.సి పాలసీ తీసుకుందామని చెప్పింది. నేను చచ్చిపోయినట్లు డాక్యుమెంట్లు పుట్టించి, ఆ కంపెనీతో మేనేజ్ చేసి డబ్బు తీసుకుని అన్నయ్యతో దూరంగా ఎక్కడికైనా వెళ్ళిపోయి కొత్త జీవితం ప్రారంభిద్దామని చెప్పింది. అందరి అప్పులూ నెమ్మదిగా తీర్చేద్దామని చెప్పింది. నేను నమ్మాను. తను చెప్పిన చోటల్లా సంతకాలు పెట్టాను. నెమ్మదిగా నేనెంత పెద్ద తప్పు చేసానో తెలిసొచ్చింది. తను, ఆ పార్వతీశంగాడు సోమరాజుని చంపేసి, తన శవాన్ని నాదిలా చూపించి ఎల్.ఐ.సి డబ్బులు సంపాదించారు. నా ఇల్లు నాకు తెలియకుండా నా చేతే పార్వతీశం పేరున రాయించుకున్నారు. ఓ రోజు నేనెళ్ళి అడిగితే అసలు నేననేవాడిని గవర్నమెంటు లెక్కల ప్రకారం లేనే లేనని చెప్పింది. నా కథ ముగిసిపోయిందని చెప్పింది."
చెప్పడం పూర్తి చేసి విండోలోనుంచి బయటకి చూస్తూ కూర్చున్నాడు శ్రీపాదం. నలుగురికీ నోట మాట లేదు. సోమరాజుని చెడ్డవాడనుకున్నందుకు పశ్చాత్తాపంతో, ఆ చచ్చిపోయింది సోమరాజేనని తెలిసి బాధతో అలా చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. కాసేపటి తర్వాత కళ్యాణరావు శ్రీపాదం కట్లు విప్పుతూ అడిగాడు.
"మీ అన్నయ్య ఏమయ్యాడో తెలుసా?"

"నేను పారిపోయాకా ఆయన పిచ్చెక్కి ఎక్కడికో వెళ్ళిపోయాడని తెలిసింది. పాపం వెర్రిబాగులోడు. నేను తప్ప ఇంకో లోకం లేదాయనకి. పెళ్ళి చేసుకోలేదు. ఏ సుఖం అనుభవించలేదు. నా జీవితం కోసమే కలలు కనేవాడు. ఆయన కలలు నాశనం చేసా. ఆయన్ని పిచ్చోణ్ణి చేసా. మళ్ళీ ఆయన నా కంటికి కనిపిస్తే కాళ్ళమీద పడి ఏడుస్తా. నన్ను మన్నించమని ప్రాధేయపడతా. ఆయన చెప్పిన కథలోలానే బతుకుదామని చెప్పి నాతో తీసుకెళ్తా," అంటూ రెండు చేతుల మధ్య మొహం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు శ్రీపాదం.
అది చూసి అందరి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి. నీళ్ళు నిండిన కళ్ళతోటే ఒకళ్ళనొకళ్ళు చూసి చిరునవ్వు నవ్వారు.

-:రెండు గంటల తర్వాత, శీనుగాడి స్కూలు దగ్గర:-

ఓ పిల్లాడు ఈరయ్యవైపు వెళ్తున్నాడు. ఈరయ్య దగ్గరిదాకా వెళ్ళి తనని కుదిపి దూరంగా వేలుపెట్టి చూపించాడు. చాలాసేపు తీక్షణంగా చూసి నెమ్మదిగా లేచి మెల్లగా కుంటుతూ అటువైపు నడిచాడు ఈరయ్య. పరిగెత్తుకుంటూ వచ్చి ఈరయ్య కాళ్ళమీద పడ్డాడు శ్రీపాదం.
పుట్టుకతో మూగవాడైన ఓ మనిషి తన జీవితకాలంలో ఎన్నో ఆటుపోట్లని ఎదుర్కొని, కష్ట సుఖాలని భరించి, చెప్పుకోలేని బాధలని, చెప్పి పంచుకుందామనుకున్న సంతోషాలని అన్నిటినీ నిశ్శబ్దంగా అనుభవించిన తర్వాత ఓ రోజు దేవుడు ప్రత్యక్షమై తనకిష్టమైనవారితో ఒకే ఒక్క మాట మాట్లాడే వరమిస్తే ఆ మాట ఎంచుకోవడానికి ఆ మనిషి ఎంత సంఘర్షణ అనుభవిస్తాడో ఆ క్షణంలో ఈరయ్యని చూస్తే తెలుస్తుంది. కింద కూలబడి తమ్ముడిని పట్టుకుని తల నిమురుతూ ఒళ్ళంతా తడుముతూ, కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు ఈరయ్య.
దూరంగా మర్రిచెట్టు వెనకనుంచి చూస్తున్న గోపాలరావు, కళ్యాణరావు, గోపాలకృష్ణ, పోతురాజులు ఎగిరి గంతేసి ఒకళ్ళనొకళ్ళు ఆనందంతో కౌగిలించుకున్నారు.
నలుగురూ కలిసి సి.ఐ సత్తిబాబు సాయంతో మహానటిని, పార్వతీశాస్త్రిని అరెస్టు చేయించారు. కేసు మిస్టరీ సాల్వ్ చేసింది సి.ఐ సత్తిబాబేనని చెప్పి తనకి ప్రమోషన్ ఇప్పించారు. పల్లంకుర్రులో ఇల్లు వెనక్కి వచ్చేలా ప్రయత్నిద్దామంటే వద్దని చెప్పాడు శ్రీపాదం. ప్రతీ రూపాయి కష్టపడి సంపాదించి తన డబ్బుతో ఇల్లు కట్టి అన్నయ్యని సుఖపెడతానని చెప్పి అందరికీ థ్యాంక్స్ చెప్పి ఈరయ్యని తీసుకుని బయలుదేరాడు.

-:రెండు నెలల తర్వాత, రచ్చబండ దగ్గర:-

రంగూన్ రాజీబాబు మొహం వెలిగిపోతోంది.
"మతి పోగొట్టేసార్రా అంతా కలిసి. దిమ్మ తిరిగిపోయింది దెబ్బకి," అన్నాడు రాజీబాబు.
"నేను ఊరెళ్ళి తిరిగొచ్చేసరికి ఒక్కొక్కడు ఒక్కో మేధావి అయిపోయాడు," అన్నాడు రామం.
"టైమండీ, టైము రావాలి దేనికైనా. టైమొచ్చిందంటే బుర్రలోంచి ఆస్కారు బయటపడుద్ది," చెప్పాడు గోపాలకృష్ణ.
"అవునవును. నీ దగ్గర ఎప్పుడూ చాలా ఐడియాలుంటాయంట కదరా. ఏది.. ఒకటి ఇలా వదులు," అడిగాడు రాజీబాబు.
గోపాలకృష్ణ మాట్లాడకుండా కళ్యాణరావు, గోపాలరావు, పోతురాజుల వైపు చూసాడు. అంతా ఏమీ మాట్లాడకుండా చిరునవ్వు నవ్వారు.
"టీ ఇదిగోండి గోపాలకృష్ణగారు. రెగ్యులర్ టీయే. మీకు ఫ్రీగా మా మాస్టరు పంపించాడు," టీ ఇస్తూ చెప్పాడు చిన్నిగాడు.
"చానా టేంక్స్‌రా చిన్నిగా," అని తన కొత్త 'ఐడియా' చెప్పడం మొదలుపెట్టాడు గోపాలకృష్ణ.
"సరే మరి. జనాల కోరిక కాదన్లేను కదా. ఓ పాష్ సినిమాలో హీరో ఇంట్రడక్షను సీను కింద బాగుంటదిది. ఇలను తుపాకీ పేలుత్తాడు. బుల్లెట్టు హీరోవైపు దూసుకొత్తా ఉంటది. హీరో నోట్లో సిగరెట్టు ఎట్టుకుని అగ్గిపెట్టి కోసం ఎతుకుతా ఉంటాడు. బుల్లెట్టు దగ్గరికొచ్చేసుద్ది. ఇక తలని కొట్టేద్ది అన్నప్పుడు సడెన్‌గా హీరో తల కొంచెం పక్కకి తిప్పి ఆ బుల్లెట్టు ఎళ్ళిపోతా ఉంటే సిగరెట్టుని దాని మీద గీసి ఎలిగించుకుని, ఓ దమ్ము లాగి గాల్లోకి పొగ ఒదులుతాడు. ఆ పొగలోంచి సినిమా టైటిల్ పడుద్ది, 'ఎదవ' అని. ఆ పొగ ఎళ్ళిపోగానే కిందేమో కేప్షను పడుద్ది,"
"'ఈడు ఎంత ఎదవంటే..' అనాండీ?" అడిగాడు చిన్నిగాడు.
"అరె, నువ్వెలా కనిపెట్టావురా?" ఆశ్చర్యంతో అడిగాడు గోపాలకృష్ణ.
ఆనందంతో అంతా చప్పట్లు కొట్టారు.

-:శుభం:-

26 November 2006